

# టేకిట్ ఈజీ!!

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



నెలకో ఎపిసోడ్ రెడీ..జీ..

ఎవరేమన్నా..ఏదేమైనా టేకిట్ ఈజీ..!

## సినిమాల పేర్లు - ఒక తులనాత్మక పరిశీలన (తొలి భాగం)

పనిలేని శీనిగాడు సినిమా పేర్లమీద పడ్డాడు. అసలు **"తులనాత్మక"** అంటే ఏంటో కనీసం ఆ పదం కనిపెట్టిన కుక్షి కన్నా తెలుసో లేదో, నాకు తెలియదు. నామటుక్కి నాకు అర్థాలతోటీ, అపార్థాలతోటీ సమ్మంధం లేదు. కేవలం పదాలు వాడేయడవే, బూజు పట్టకుండా ఉంటాయి కదా, అంచేత. *ఇంతకీ సినిమా పేర్లగురించి చెప్పవలసినంత ఉపద్రవమేం ముంచుకొచ్చిందీ?* అని ఊ..దీర్ఘాలు తీయకండి. మీకేం, మీరెన్ని కబుర్లన్నా చెబుతారు. మీరు మాయింట్లో పుట్టుంటే తెలిసేది, సినిమా పేరుకీ మన జీవితాలకీ ఎంత లంకె వుందో.

అసలు పుట్టి భూమ్మీద పడ్డ ఏడాదికో ఎంతకో తీసికెళ్ళారు మొదటి సినిమా **"బంగారు బాబు"** కి. అప్పడిదాకా మనకి మాటలురాక, సినిమాకి తీసికెళ్ళమని సంజ్ఞలు చేసినా, వాళ్ళు అర్థంకానట్టు నటించారే తప్ప, ఎంతమొత్తుకున్నా తీసికెళ్తేనా? సరే, మన్నప్పటికీ అండరెష్టిమేటేసేసి, కుర్రకుంక, వీడికేం అర్థమౌతుందిలే అని తీసికెళిపోయారు, డీలక్స్ హాల్లో ఫస్ట్ షోకి. కానీ నాకు **నాగేస్రావు, వాణిశ్రీ,** అందరూ ఓ..తెగ నచ్చేసారు. అప్పుడే డిసైడ్ అయిపోయాను, ఎప్పుడైనా పెద్దోణ్ణి అయ్యాకా, **నేనూ, వాణిశ్రీ, డీలక్స్ హాల్ లో ఫస్ట్ షోకి రావాలని.** కానీ, నా భావ వ్యక్తీకరణకింకా భాష తోడవలేదు కాబట్టి ఇంట్లోవాళ్ళు బతికిపోయారు. అన్నట్టు నేను పుట్టకముందు, అన్నని **"తల్లా?పెళ్ళామా?"** సినిమాకి తీసికెళ్ళార్ట. అంటే నా నోరు కనిపిస్తుందిగానీ, ఇప్పటిదాకా నాకా సినిమా చూపిస్తేనా. అలాగే మా బావగాడు, డొంకరాయి లో అన్నకి **తీర్పు** సినిమా చూపించేసాడు మరి, నన్ను తీసికెళ్ళకండా, తప్పు కాదూ ? అలాగే ఉండేది చిన్నప్పుడు, అన్నీ అన్యాయాలే.

కొన్నాళ్ళు పోయాకా, నాన్నగారి ఫ్రెండున్నారుకదా బంగారయ్య గారూ, వాళ్ళ ఫామిలీతో కలిసి **భూకైలాస్** కెళ్ళాం, మళ్ళీ రిలీజ్ అయినప్పుడు. అప్పుడేవైందంటే, తెరమీద రామారావు బెమ్మాండంగా నడుచుకుంటూ, చేతిలో కమండలవట్టుకుని, **"దేవ దేవ ధవళాచల.."** అనిపాడుకుంటూ వెళ్ళి, ఓ చోట ఇల్లా కూచుంటున్నాడో లేదో, నారదుడొచ్చేసాడు, అంటే **నా..గే..స్రా..వు...ట !!!** ఎక్కడన్నా, నారదుడివేషం ఏ **త్యాగరాజు** చేతో , **కాంతారావు** చేతో వేయిస్తారుకానీ, మా **నాగేస్రావు** చేత నారదుడేషం వేయిస్తారా?

హన్నా. అందుకే కోపంవచ్చేసి, నారదుడు రాగానే నేను సీట్లోంచి లేచి **"ఏమనుకున్నావు, నన్నెవరనుకున్నావు? పిచ్చివాడిననుకున్నావా? సినిమామోహం తెలీనోడిన నుకున్నావా"** అని ఆ డైరెక్టర్ మీద పెద్దగా అరిచేసాను, **"బంగారు బాబు"** లో పాట పాడుతూ. హాల్లో అంతా నవ్వులు. నాన్న తెగ ఇబ్బంది పడిపోయారు **"కుఱ్ఱాడు కదా.."** అంటూ ఇబ్బందిగా నవ్వి, అందరికీ సర్ది చెప్పి, ఇంటికొచ్చాకా చెప్పుకి పని చెప్పారు. అప్పటినించీ ఏడాది పాటు అందరికీ సినిమా కట్టు, నా పుణ్యావా అని. చూసేదే ఆర్నెల్లకోమాటు, అదీ గుడ్డెక్కింది, నా గుండె అప్పుడే బరువెక్కింది.

అప్పటికీ రేడియోలో పాటలు విని, స్కూలు అయిపోయాకా టీచర్ల కోరికమేర **"జొన్నపూలా రైకాదానా"** అంటూ పాడి ఎంటర్ టెయిన్ చేసేవాణ్ణి. నాలుగో క్లాసుకొచ్చాకా స్కూలువాళ్ళు ఓ శనివారం మార్నింగు షోకి రూపాయికి రెండుటిక్కెట్లాటకి **"జంతుప్రపంచం"** చూపించారు వెంకటేస్సరా హాల్లో. పాటలు లేవుగానీ, సినిమా బానే ఉంది, పెద్ద పాములూ, జిరాఫీలూను. దాంట్లో **"నామాల తాతయ్య"** ట్రయిలరేసారు. ఇంటికొచ్చినప్పట్నించీ ఆ సినిమా ఎలా చూడాలా అని ఆలోచించి, ఆలోచించి, ఓ ప్లానేసి, **"అమ్మా, మొన్నట్నించీ, ఎవరో వెంకటేశ్వరస్వామిలా నామాలు పెట్టుకున్న తాతగారు కనిపిస్తున్నారే, కలలో.. "** అని తెగ గోల చేసేసాను. అమ్మ వెంఠనే నాన్నగారితో చెప్పి, మా వెంకటేశ్వర స్వామి గుళ్ళో నాకు మళ్ళీ గుండుగీయిస్తే ఎలా ఉంటుందని అడిగింది. సినిమా ఎలాగూ చూపించరు, గుండు ఖాయవౌతుందని భయపడి, నేను పోరుపెట్టడం మానేసాను. ఆసినిమా ఆడేసి.. నన్ను చూడకండానే వెళ్ళిపోయింది... ఆ తరవాత ఎల్లాగైనా చూడాలనుకున్న సినిమా **"అమ్మ ఎవరికైనా అమ్మ"**.

అన్న నన్నెప్పుడూ ఏవీ అడిగేవాడు కాదు. కానీ ఈ సినిమాలో ఏనుగులుంటాయని, చాలా బావుంటుందని చెక్కావాడు చెప్పడంతో, నన్నొచ్చి అడిగాడు, ఒరేయ్, నువ్వు పేచీపెట్టవా, సినిమాకెళ్దాం..అని. మరి మనకి లెఖ్ఖల్రావు, వాడికి పేచీపెట్టటం రాదు, అన్నా,తమ్ముడన్నాకా ఆమాత్రం సహాయం చేసుకోపోతే ఎలా? మనకి సపోర్టంటే సురేంద్రనాథ్ బెనర్జీ అంతటోళ్ళవయ్యేవాళ్ళం కదా, అందుకని, ఓ రోజంతా తెగ పేచీ పెట్టేసి, చివరికి **" ఆ సినిమాలో ఆఖరికి అమ్మ ఏనుగు కూడా దాని పిల్లని సినిమాకి తీసికెళుతుందిట, అదీ అమ్మంటే. అమ్మ ఎవరికైనా అమ్మట, అసలు నువ్వు మా అమ్మ వేనా?"** అని సెంటిమెంట్‌తో కుమ్మేసి, రెండు రూపాయలు సంపాదించేసా. ఆ సినిమా చూసిన రోజున అన్న కళ్ళల్లో కృతజ్ఞతాభావం కొట్టొచ్చినట్టు కనపడింది. నేను వాడి తమ్ముణ్ణి అయినందుకు మొదటిసారిగా వాడు గర్వపడిన సందర్భం ఇంకా నా కళ్ళముందు సినిమా రీల్లా కదులుతోంది. అసలు డబ్బింగు సినీమాకి అల్లాంటి పేరుపెట్టినోడికి శతకోటి దండాలు చెప్పాలి.

ఆ తరవాత నేను కృతజ్ఞత చెప్పుకోవలసిన వ్యక్తి మా సీలేరు చిన్నత్తయ్య. పాపం ఏలోకాన వుందోకానీ, అమలాపురం వచ్చినప్పుడల్లా సినిమా కెళ్ళేది. పెద్దత్తకి ఖాళీ లేకపోతే, ఎవరికీ చెప్పకుండా నన్ను వెంటేసుకుని , **"ఇప్పుడే బజారుకెళ్ళొచ్చేస్తామే బాలా.."** అని అమ్మదగ్గర అబద్ధవాడేసి, సినిమాకి తీసికెళ్ళేది, మార్నింగ్ షోకి. అలా చూసినవే **"ఇంటిటి రామాయణం"**, కొన్నాళ్ళుపోయాకా **"శివరంజనీ"** ని. వాటిల్లో ట్రయిలర్సు నన్ను అమాంతం పెద్దమడిసిని చేసేసాయి. మా అత్తయ్య చేతి వేళ్ళ సందుల్లోంచి చూసిన **"సందులో సుందరి"**, **"ఇదిగో, ఇక్కడిదాకా.."** అనే మలయాళం డబ్బింగు సినిమా ట్రయిలర్సులో నాకు తెలిసిన ఏక్టర్లెవరూ కనడకపోయినా, కేవలం రెండునిమిషాల్లో తెరమీద నా మనసు చూరగొన్న అద్భుతమైన నటనని చూపించి, నన్ను ఆకట్టేసుకున్నాయి. రెండిట్లోనూ ఇంచుమించు ఒకటే సబ్జెక్టు. ఎవరో ఆడావిడ వానలో తడిసి తడిసి, ఒక ఇంట్లో కెళుతుంది. అది ఒక నిమిషం. రెండోనిమిషం ఎవడో పెద్ద బొజ్జ వాడు, సైకిల్ పక్కన పడేసి, లుంగీ సద్దుకుంటూ, పరిగెత్తుకుంటూ ఆ యింటికేసి వస్తూ ఉంటాడు.

అంతే, ట్రయిలర్ అయిపోతుంది. కొన్నాళ్ళు మా చిన్నత్త బిజీ అయిపోయి మా వూరు రాలేదు. ఆ సినిమాలు రిలీజయిపోయాయి. ఇంక ఉండబట్టలేక మా పెద్దత్త దగ్గరికెళ్ళి అడిగా **" తల్లీ, పెద్దత్తా, అంటారు కదే, మనిద్దరం ఆ సినిమాల కెళదావే, పాపం ఆ సినిమా ఆవిడకి ఏం జలుబు చేసిందో, ఏవిటో.."** అని. ఆవిడ చెవిమెలేసి, **"ఇదేం బుద్ధ్రులా నాయనా, అసలు నిన్ను కాదు, సత్తేన్ని అనాలి, ఈ సారి రానీ దాన్ని, దిక్కుమాలిన సినిమాలూ మీరూ.."** అంటూ విసిగేసుకుని, నోట్లో తేగముక్క పెట్టేసింది ఏడుస్తుంటే.. అలా, ఆ సినిమాలు చూడడవే పడలేదు. అయినా తీసిన వాళ్ళు చక్కగా ఏ **" వరుణదేవుడి మహత్యం"** అనో, **" వాన పిల్ల వ్రతం"** అనో పెట్టుకునుంటే, నాలాంటివాళ్ళకి ఏ ఇబ్బందీ ఉండకపోను. అడగరూ పెట్టరూ, పుసుకూ, పుసుకూ పేర్లెట్టేసుకోడవే.

ఆతరవాత సూర్యగ్రహణం రోజున, బైట వుంటే మమ్మల్ని పట్టుకోడం కష్టం, సూర్యుణ్ణి చూసేసి, డెఫినెట్‌గా కళ్ళు దొబ్బించుకుంటామని డిసైడైపోయి, **"స్రెకటరీ"** సినిమాకి తీసికెళ్ళారు పెదనాన్న గారు. అప్పుడు **వాణిశ్రీ**ని మళ్ళీ చూసాను కదా, పాపం నాకోసం చాలా బెంగెట్టుకున్నట్టుగా అనిపించింది, కాసేపు ఓదార్చి, త్వరలోనే నేను మద్రాసు వస్తానని ఎవరూ చూడకండా ప్రామిస్ చేసి, వచ్చేసాను. తరవాత పౌరాణికాలు చాలానే చూశాం. మళ్ళా సినిమాకోసం ఇబ్బంది పడ్డది ఏడోక్లాసులో అనుకుంటా. **"పొట్టేలు పున్నమ్మ"**. అసలు ఆ వీరోయిన్ను నాకోసవే పుట్టిందేమో అనుకున్నా, మా ఇద్దరి పేర్లలో మొదటి అక్షరాలుకూడా కలిసిపోయాయి కాబట్టి. కానీ ఇంట్లో అలా చెబితే పంపించరు కదా, అందుకని..**"అమ్మా, పొట్టేళ్ళున్నాయిటే, అసలు అవి కొమ్ములతో ఫైటింగ్ చేస్తుంటే, హాల్లో ఢాం..ఢాం అని శబ్దంట. అసలు చూసితీరాలిటే, "**అని ఎన్ని కథలు చెప్పినా వింటేగా. ఇలా కాదని పొట్టేలుకి మొక్కుకుని నిరాహారదీక్ష చేసా. **శ్రీ** ప్రియ పుణ్యావా అని మూడుపూటలు భోజనం చెయ్యలేదు అఫీషియల్‌గా. అంటే పక్కనించి అన్న అన్నీ అందించాడు కాబట్టి ఏదో లాగించేసాను. ఒక రోజు పోయాకా, పొట్టేలు కనికరించి, అమ్మ మనసు కరిగి, మూడు రూపాయిలు అనుగ్రహించింది. అన్న, వాళ్ళ క్లాస్మేట్లూ, నేనూ వెళ్ళాం. వాళ్ళందరికీ పొట్టేలు ఫైట్లు భలే నచ్చాయి. కానీ నాకా సినిమాలో పొట్టేలే కనపడలేదు ! కానీ, ఏ మాటకామాటే చెప్పుకోవాలి, ఆ డైరెక్టరెవరో బతకనేర్చినవాడు, చక్కటి పేరుపెట్టాడని, వాణ్ణి వెయ్యిసార్లు దీవించేసా. పొట్టేలు కావల్సినవాడు పొట్టేలు చూసుకుంటాడు, పున్నమ్మ కావలసినాడు పున్నమ్మని చూసుకుంటాడు !!

****